AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
19-8-2025
NIZAMABAD / KAMAREDDY
PAGES - 2

సర్దార్ పాపన్నగౌడ్ జయంతి



2



2

మానవత్వం చాటుకున్న సీఐ

## 21 నుంచి ఘన్‌పూర్ రైల్వేగేట్ మూసివేత



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని ఘన్‌పూర్, డిచ్‌పల్లి మధ్య రైల్వేగేట్‌ను మరమ్మతుల దృష్ట్యా మూసివేయనున్నారు. ఈ మేరకు డిచ్‌పల్లి పంచాయతీ కార్యదర్శి రమేశ్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ రాత్రి 11 గంటల వరకు రైల్వేగేట్ మూసి ఉంటుందని ఆయన వివరించారు. రైలు పట్టాల మరమ్మతుల కారణంగా గేట్‌ను మునివేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాబట్టి ఘన్‌పూర్, ముల్లంగి, ఖిల్లా డిచ్‌పల్లి గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గం గుండా వెళ్లాలని ఆయన సూచించారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో దిగువకు ఉరకలెత్తుతున్న వరదనీరు



నిజాంసాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీళ్లు వదులుతున్న దృశ్యం



# జల సాగరాలు

"గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షా లతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. జలాశయాలకు వరద పోటెత్తుతుండడంతో ప్రధాన ప్రాజెక్టుల గేట్లు తెరుచుకున్నాయి. సోమవారం అర్ధరాత్రి తర్వాత నిజాంసాగర్ వరద గేట్లు తెరవగా, ఉదయం శ్రీరాంసాగర్ వరద గేట్లను అధికారులు ఎత్తారు. దీంతో ఇటు గోదావరి, అటు మంజీర నదులు భారీ వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

- అక్షరటుడే, ఆర్మూర్/నిజాంసాగర్

- శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల గేట్ల ఎత్తివేత
- రెండు జలాశయాలకు పోటెత్తిన వరద
- తెరుచుకున్న కౌలాస్ నాలా గేట్లు
- పొంగిపొర్లుతున్న సింగితం, పోచారం

### శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేత

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరద వస్తోంది. స్థానికంగా కురుస్తున్న వర్షాలతో పాటు నిజాంసాగర్, మహారాష్ట్ర నుంచి వరద వస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సోమవారం ఉదయం ప్రాజెక్టులోకి లక్షా 50వేల క్యూసెక్కుల వరద రావడంతో గేట్లను ఎత్తారు. తొలుత తొమ్మిది వరద గేట్లు తెరిచారు. అనంతరం 24 గేట్లకు పెంచారు. సాయంత్రం వరకు 39 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కులు గోదావరి నదిలోకి విడుదల చేశారు. కాగా.. కాల్వల ద్వారా మరో 25 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1089.3 అడుగుల (74.425 టీ ఎంసీలు) మేర నీరు నిల్వ ఉంది. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు సూచిస్తున్నారు.

### నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సింగూరు, పోచారం, ఘన్‌పూర్ నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో సోమవారం అర్ధరాత్రి తర్వాత జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, అధికారులు గంగమ్మకు పూజలు చేసి గేట్లు ఎత్తారు. తొలుత ఏడు వరద గేట్లు ఎత్తగా.. అనంతరం 11 గేట్లను తెరిచారు. క్రమంగా 16 గేట్లకు పెంచారు. సాయంత్రం 4 గంటల వరకు లక్షా 6వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. లక్షా 25వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1403.25 అడుగులు (15.323 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ఈఈ సొలోమన్ తెలిపారు. ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది.



పొంగిపొర్లుతున్న సింగితం

నిజాంసాగర్ ప్రాజెక్టు అనుబంధంగా నిర్మించిన సింగితం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అలుగుపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతోంది. సింగితం రిజర్వాయర్ అలుగు పొంగిపొర్లుతుండడంతో మహమ్మద్ నగర్ మండలంలోని తునికిపల్లి గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.



### షెట్లూర్ వాగులో చిక్కుకున్న గొర్ల కాపర్లు

భారీ వర్షాల నేపథ్యంలో షెట్లూర్ వాగులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. బిచ్కుంద మండలంలోని శెట్లూరు వద్ద వాగులో సుమారు 650కి పైగా గొర్రెలతో నలుగురు కాపర్లు

– మిగతా 2వ పేజీలో..



కౌలాస్‌నాలా గేట్లు ఎత్తివేత

జుక్కల్ నియోజకవర్గంలోని కౌలాస్ నాలా గేట్లు సైతం ఎత్తారు. ప్రాజెక్టుకు భారీ ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో నిండుకుండలా మారింది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29,444 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టు ఐదు వరద గేట్ల ద్వారా 31,350 క్యూసెక్కుల నీటి ని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ సుకుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లకు (1.237 టీఎంసీలు) గాను 457.80 మీటర్ల (1.200 టీఎంసీలు) మేరు నీరు నిల్వ ఉంది.



## గణేశ్ మండళ్లు సమాచారం అందించాలి : సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** గణేశ్ విగ్రహాల ఏర్పాటు సమాచారాన్ని నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం సీపీ ప్రకటన విడుదల చేశారు. ప్రతిఒక్కరూ పర్యావరణ అనుకూలమైన వినాయక చవితి జరుపుకోవాలని, గణేశ్ మండళ్ల వద్ద నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకునేలా గణేశ్ మండళ్ల నిర్వాహకులు పోలీసుశాఖకు సహకరించాలని సీపీ పేర్కొన్నారు. మండళ్ల నిర్వాహకులు సైతం నియమనిబంధనలు పాటించాలని సూచించారు. ఈనెల 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని అన్ని గణేశ్ మండపాలకు సెక్యూరిటీ ఇచ్చేందుకు పోలీస్‌శాఖ సిద్ధంగా ఉందని సీపీ తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిల్లోని అన్ని గ్రామాల్లోని గణేష్ మండపాల నిర్వాహకులు http://policeportal.tspolice.gov.in/index.html లింక్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. మండపాల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు.

## సివిల్ సప్లయ్స్ కమిషనర్‌ను కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** సివిల్ సప్లయ్స్ శాఖ కమిషనర్ చౌహాన్‌ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సోమవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు. పదేళ్లలో కార్డులు లేకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రారంభమైనందున, అర్హులైన వారికి కొత్త కార్డులు అందించాలన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు నివేదికలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల భవనాలపై సోలార్ పవర్ పరికరాల ఏర్పాటుకు శాఖల వారీగా వెంటనే నివేదికలు అందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, గురుకులాల భవనాలపై సౌర విద్యుత్ ఫలకాల ఏర్పాటు, నీటి పారుదల, మిషన్ భగీరథ శాఖలకు చెందిన ఖాళీ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు వీటి ఏర్పాటుకు సంబంధించి నివేదికలు రూపొందించి, మంగళవారం సాయంత్రం అందించాలన్నారు. పరికరాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, విద్యుత్ కనెక్షన్, తదితర వివరాలను నివేదికలో పొందుపర్చాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలులో పూర్తిగా విఫలం

**అక్షరటుడే, బాన్సువాడ:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బాన్సువాడ పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సీఎం ఢిల్లీలో ధర్నా చేస్తే ఆ పార్టీ నాయకులే రాలేని పరిస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు.








## మానవత్వం చాటుకున్న సీఐ నరహరి





**అక్షరటుడే, కామారెడ్డి :** పట్టణ సీఐ నరహరి మానవత్వం చాటుకున్నారు. కామారెడ్డి పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో గత కొద్దిరోజులుగా వర్షానికి తడుస్తూ ఓ వృద్ధురాలు ఉంటోంది. కొడుకులు వదిలేయడంతో ఎవరైనా భోజనం ఇస్తే తింటూ అక్కడే ఉంటోంది. వృద్ధురాలి పరిస్థితికి చలించిన సీఐ నరహరి తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లో ఉన్న వృద్ధురాలిని ఓ ఆటోలో ముందుగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన తర్వాత వృద్ధాశ్రమానికి తరలించారు. దీంతో పలువురు సీఐని అభినందిస్తున్నారు. అలాగే పోలీసులతో పాటు అక్కడికి చేరుకున్న మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ఇందుప్రియ వృద్ధురాలికి అండగా నిలిచారు. వృద్ధురాలి పతిస్థితిని చూసి దుస్తులు మార్పించారు. టీ తాగించి, స్వయంగా ఇడ్లీ తినిపించారు. వృద్ధురాలితో పాటు ఆటోలో ఆస్పత్రికి వెళ్లి సపర్యలు చేసి అక్కడి నుంచి వృద్ధాశ్రమానికి తరలించే వరకు వెంట ఉన్నారు.




## న్యాయవాదుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా..

**అక్షరటుడే, కామారెడ్డి:** న్యాయవాదుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తానని టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ ఛైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి లీగల్ సెల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవాదులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటుందన్నారు. న్యాయవాదుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ ఛైర్మన్ దేవరాజ్ గౌడ్ న్యాయవాద సమస్యలను అశోక్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, జ్యుడీషియల్ కమిటీ ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై విన్నవించారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయం సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి ముబిన్, పీసీసీ లీగల్ సెల్ వైస్ ఛైర్మన్ ఉమా శంకర్, వెంకటేశ్వర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## వర్షా నికి కూలిన ఇళ్ల పరిశీలన

**అక్షరటుడే, నిజాంసాగర్:** మండల కేంద్రంతో పాటు బ్రాహ్మణపల్లి గ్రామంలో వర్షానికి కొన్ని ఇళ్లు కూలిపోయాయి. దీంతో సోమవారం మధ్యాహ్నం కాంగ్రెస్ నిజాంసాగర్ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఇళ్ల పరిస్థితిని తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ల వివరాలను తెలుసుకుని తహశీల్దార్ భిక్షపతికి అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# జల సాగరాలు



మంజీర నదిలో చిక్కుకున్న గొర్రెలను బయటకు తీసుకొస్తున్న గ్రామస్థులు



పోతంగల్ మండలంలో మంజీర నదిలో మునిగిన హనుమాన్ ఆలయం



మహమ్మద్ నగర్‌లో ప్రజలను ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న దృశ్యం



బోధన్‌లో..



ఎల్లారెడ్డిలో వంతెనపై పారుతున్న వర్షపు నీరు

**మొదటిపేజీ తరువాయి:** చిక్కుకున్నారు. అధికారులు స్పందించి వారిని కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. షెట్లూర్ గ్రామ శివారులోని వాగులో సోమవారం ఉదయం నలుగురు కాపర్లు గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. వాగులో వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో కాపర్లలతో పాటు గొర్రెలు చిక్కుకుపోయాయి. దీంతో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగలోకి దిగి గొర్రెల కాపర్లను రక్షించారు. అనంతరం గొర్రెలను సైతం సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

### మునిగిన హనుమాన్ ఆలయ ప్రాంతం..

మంజీర ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోతం గల్ మండలంలో నది పరీవాహక ప్రాంతంలో ఉన్న హనుమాన్ ఆలయం మునిగిపోయింది. గుడి గోపురం మీదుగా వరద ప్రవహిస్తోంది. కాగా.. నదులు, చెరువులు, వాగులకు భారీగా వరద వస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఎవరూ జలవనరుల వైపు వెళ్లవద్దని చెబుతున్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.





నాగమడుగు లోలెవెల్ వంతెన వద్ద పోలీసు బందోబస్తు



వేల్పూర్ మండలంలో చెరువును పరిశీలిస్తున్న ఎంపీవో సాయిలు



బాన్సువాడ నుంచి కామారెడ్డి వెళ్లే దారిలో..



జలమయమైన బాన్సువాడ ఎక్సైజ్ కార్యాలయం

## జాతీయస్థాయి కవితల పోటీల్లో రశ్మిత ప్రతిభ



**అక్షరటుడే, భీమ్‌గల్:** జాతీయస్థాయి కవితల పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపింది. భీమ్‌గల్ మండలం బాచన్‌పల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాల గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం వురిమల్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో కవితల పోటీని నిర్వహించారు. పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు పాల్గొన్నారు. బాచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.రశ్మిత ఈ పోటీల్లో పాల్గొంది. కాగా.. పోటీల ఫలితాలను ఆదివారం ఫౌండేషన్ అధ్యక్షుడు వురిమల్ల సునంద ప్రకటించారు. పోటీల్లో రశ్మిత ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందుకున్నారని హెచ్‌ఎం వివరించారు. భవిష్యత్తులో మరిన్ని బహుమతులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోదశ్రీ, విమల, వసంత, గంగాధర్ పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ తనిఖీ

**అక్షరటుడే, భీమ్‌గల్ :** బాల్కొండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను కేజీబీవీల రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డుల తనిఖీ అనంతరం మధ్యాహ్న భోజనం, సైన్స్ లాబ్, గ్రంథాలయం, ఆన్‌లైన్ తరగతులు తదితర అంశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు అంశాలపై ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు పలు మెళకువలు నేర్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు గణేష్, సుకుమార్, శ్రీనివాసరాజ్, దత్తాద్రి, రవి, శ్రావణి, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరికలు



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బాచన్‌పల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచులు బనారం నర్సయ్య, కె.హన్మాండ్లు, మాజీ ఉపసర్పంచ్ పత్తిమల బాలయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరగా.. పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వామి, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, గాండ్ల బాలయ్య, కొరాడి రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని తెలంగాణ భవన్‌లో..



బాల్కొండ మండల కేంద్రంలో..



లింగంపేట మండల కేంద్రంలో..

## పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. సామాజిక సమానత్వం బహుజనులకు రాజ్యాధికారం కోసం అలుపెరగని పోరాటం చేసిన వీరుడు సర్దార్ సప్పాయి పాపన్న గౌడ్ అని వక్తలు పేర్కొన్నారు. బహుజనులకు రాజ్యాధికారం కోసం ఆయన పోరాటాలు వెలకట్టలేమన్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్






బాల్కొండ గౌడ సంఘంలో..



భీమ్‌గల్‌లోని కిసాన్ నగర్‌లో..



పిట్లం మండల కేంద్రంలో..



ఎల్లారెడ్డి మండలంలో..

## క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ




**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను మండల వైద్యాధికారి వీణ సోమవారం అందజేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు బలమైన ఆహారాన్ని అందించాలని ఉద్దేశంతో కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు పంపిణీ చేస్తున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు గౌస్, ఎస్తేరు, తబిత, సీహెచ్‌వో నారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి మృతి

**అక్షరటుడే, బాన్సువాడ:** జాతీయ రహదారిపై కల్వర్టు వద్ద నీరు ప్రవహించేలా ఏర్పాటు చేసిన పైప్‌లో ఇరుక్కుని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నస్రుల్లాబాద్ మండలం దుర్కి శివారులో కల్వర్టు వద్ద చేపలు పట్టేందుకు దేశాయిపేట్ గ్రామానికి చెందిన రాజు (28) వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ రోడ్డు పనుల్లో భాగంగా అమర్చిన పైప్‌లో రాజు ఇరుక్కున్నాడు. దీంతో బయటపడే అవకాశం లేకపోగా నీళ్లలో మునిగి మృతి చెంది ఉంటాడని స్థానికులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.